క్లుప్తంగా

పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కులు



నిడదవోలులో పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ

నిడదవోలు: విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు జలవనరుల శాఖ అధికారులు శుక్రవారం 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పశ్చిమడెల్టా పరిధిలో ఖరీఫ్ సాగునీటి అవసరాల మేరకు క్రమక్రమంగా నీటి విడుదలను పెంచుతున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలో ఉన్న ఏలూరు కాలువకు 925 క్యూసెక్కులు, నరసాపురం కాలువకు 1942 క్యూసెక్కులు, అత్తిలి కాలువకు 307 క్యూసెక్కులు, తణుకు కాలువకు 754 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం గోదావరి నీటి మట్టం 13.52 నమోదైంది.

భోజన ప్యాకెట్ల పంపిణీ



భోజన పొట్లాలు అందజేస్తున్న రొటేరియన్లు

నిడదవోలు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నిడదవోలులోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం 96 మంది గర్భిణులు, బాలింతలకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, గొన్నాబత్తుల రామారావు, పొన్నా సుబ్రహ్మణ్య శర్మ, గుంటిపల్లి శివ కుమార్, గోపిరెడ్డి శ్రీనివాస్, కొర్లేపర రత్నకుమార్, కోటిపల్లి పండు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలి

నిడదవోలు రూరల్: బాలికలు ఉన్నత విద్య, ఉత్తమ కుటుంబ బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని బాలల పరిరక్షణ జిల్లా విభాగం సభ్యురాలు శిరీషా అన్నారు. పురుషోత్తపల్లి హైస్కూలు, డి.ముప్పవరం ఎంపీయూపీ పాఠశాలల్లో బేటి బచావో–బేటి పడావో కార్యక్రమంలో భాగంగా బాలికలకు వివిధ అంశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ పి.నళిని, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అనుమతి ఇచ్చినా ప్రారంభం కాని పాఠశాల

నల్లజర్ల: పోతవరం కొత్తపేటలో ప్రభుత్వం నూతనంగా మండల పరిషత్ పాఠశాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చి నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకు అక్కడ పాఠశాల ప్రారంభం కాలేదు. గతంలో ఆ ప్రాంతానికి దగ్గర ఉండే వివేకానంద ఎయిడెడ్ స్కూలు 2023లో ప్రభుత్వంలో విలీనం చేశారు. ఈ ప్రాంతంలో విద్యార్థులు దూరప్రాంతానికి వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. అంతేకాకుండా రాకపోకల సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఆ ప్రాంత ప్రజల అభ్యర్థన మేరకు కొత్తపేటలో పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. త్వరితగతిన ఇక్కడ పాఠశాల ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో 1955లో వివేకానంద ఎయిడెడ్ స్కూల్‌ను ప్రత్తిపాటి వెంకట్రావు ప్రారంభించి దానిని యూపీ స్కూలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ స్కూలుకు బ్రాంచి స్కూలు కొత్తపేటలో ఉండేది. అది 2006లో తీసేశారు. అప్పటి నుంచి పిల్లలు కిలోమీటరు దూరంలో ఉండే వివేకానంద స్కూలుకు వెళ్లేవారు. ఇప్పుడు అది విలీనం కావడంతో కొత్తపేటలో స్కూలు ఏర్పాటు చేసే ఆవశ్యకత ఏర్పడింది.

ఎమ్మెల్యే, కలెక్టర్‌ను కలసిన శ్రీవారి దేవస్థానం ఈఓ

ద్వారకా తిరుమల: గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, ఏలూరు జిల్లా నూతన కలెక్టర్ వెట్రి సెల్విలను శుక్రవారం శ్రీవారి దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా ఉదయం నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలో ఎమ్మెల్యే మద్దిపాటిని ఆయన నివాసం వద్ద ఈఓ, అర్చకులు, పండితులు కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు, పండితులు మద్దిపాటికి స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఈఓ త్రినాథరావు చినవెంకన్న మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం ఏలూరు కలెక్టరేట్‌లో నూతన జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని కలసి, పూల బొకేను అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన నాక్ బృందం పర్యటన

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గ్రేడ్ కేటాయించడానికి వచ్చిన నాక్ బృందం రెండు రోజుల పర్యటన శుక్రవారం ముగిసింది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాక్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ రామన్ రంగరాజన్, కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ వైహెచ్ నాయక్ వడి, మెంబర్ డాక్టర్ అంజన్‌కుమార్ నాయుడు ఆఫీస్ పనితీరు, ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలు, కళాశాల భౌతికమైన వాతావరణాన్ని పరిశీలించారు. అనంతరం ఎగ్జిట్ మీటింగ్ నిర్వహించి, కళాశాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై సూచనలు చేశారు.

చక్కటీ జీవితానికి కవచంలా..

- టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం
- వ్యాధుల బారి నుంచి రక్షణ
- ప్రతి బుధ, శనివారాలలో టీకాల కార్యక్రమం
- ప్రభుత్వ ఆసుపత్రిలో నరిపడే నిల్వలు



చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

నల్లజర్ల: వ్యాధుల నుంచి జీవితానికి రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా ఉండాలి. గర్భిణుల నుంచి అప్పుడే పుట్టిన శిశువుల వరకు వైద్యులు సూచించిన సమయాలలో ఆయా టీకాలు, వ్యాక్సిన్లు వేయించుకుంటే వ్యాధులు రాకుండా ఉంటాయి. జీవితాంతం ఆరోగ్యంగా ఉండాలంటే వైద్యులు సూచించే వ్యాధి నిరోధక టీకాలు సరైన సమయంలో వేయించుకోవాలి. అయితే చాలా మంది గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వీటిపై అవగాహన లేక వివిధ రకాల వ్యాధులతో ఆసుపత్రుల పాలవుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అన్ని ఆసుపత్రులలో, సబ్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ప్రతి బుధవారం, శనివారం వ్యాధి నిరోధక టీకాలు అందిస్తున్నారు.

వ్యాక్సిన్ వేసేది ఇలా..

- గర్భిణిగా నిర్ధారణ అయిన తర్వాత 3 నెలల తర్వాత టీటీ ఇంజక్షన్ చేయాలి. నెల రోజుల వ్యవధిలో మరోసారి టీటీ ఇంజక్షన్ ఇవ్వాలి. వీటితో పాటు ఐరన్, పోలిక్, కాల్షియం ట్యాబ్లెట్లు అందించాలి.
- అప్పుడే పుట్టిన శిశువుకు 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్–బీ డోసు వేయించాలి. దీంతో పోలియో, పచ్చకామెర్లు నుంచి రక్షణ లభిస్తుంది.
- 14రోజుల వ్యవధిలో క్షయరాకుండా బీసీజీ టీకా వేయించాలి.
- ఆరు, 14వారాల వ్యవధిలో ఐపీవీ చుక్కలు వేయించాలి. వీటితోపాటు 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటావాలెంట్ వేయించాలి. వీటివల్ల కోరింతదగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడువాపు, పచ్చకామెర్లు వంటి వ్యాధులు నుంచి చిన్నారిని కాపాడుకోవచ్చు.
- 9 నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టువ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్–ఏ చుక్కలు వేయించాలి.
- 16 నెలల నుంచి 24 నెలల వయసులో బూస్టర్ డోస్ టీపీటీ, మీజిల్స్, విటమిన్–ఏ ఓపీ వేయించాలి.
- ఐదేళ్ల పూర్తయిన తర్వాత డీపీటీ డోసు వేయించాలి.
- 10–16 సంవత్సరాలు పూర్తయితే టెటనస్ టెక్సాయిడ్(టీటీ)చేయించాలి.
- 9నెలల నుంచి ఐదేళ్ల వయస్సు వరకూ ప్రతి ఆరు నెలలకొకసారి విటమిన్–ఏ చుక్కలు మొత్తం 9 డోసులు వేయించాలి.

టీకాలు తప్పనిసరి



గర్భిణులకు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వీటి ద్వారా ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజలలో టీకాలపై తమ సిబ్బందితో అవగాహన కల్గిస్తున్నాం.

– టి.గంగాధరరావు, పీహెచ్‌సీ డాక్టరు, నల్లజర్ల

ఔట్ రీచ్‌లలో ప్రత్యేక శిబిరాలు



ప్రతి నెల 1, 3 బుధవారాలలో సచివాలయాల వద్ద, 1, 3 శనివారాలలో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద టీకాల కార్యక్రమం జరుగుతుంది. ప్రతి వెయ్యి మంది జనాభా ఉన్నచోట ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

–గౌతమి, ఏఎన్ఎం సచివాలయం–2, అనంతపల్లి

నేడు మెగా లోక్ అదాలత్

కొవ్వూరు: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం కొవ్వూరు కోర్టు హాలులో మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎన్.శ్రీ నివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు రాజీ పడదగిన కేసు లను లోక్ అదాలత్ ఏవిధమైన ఖర్చులేకుండా పరిష్కరించుకోవచ్చునని సూచించారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ కేసులు పరిష్కరించుకుంటే సమయంతో పాటు, ఖర్చులు ఆదా అవుతాయని సూచించారు. పరిష్కరించుకో దగిన సివిల్, క్రిమినల్ కేసులతో పాటు బ్యాంకు సేవలు, బీఎస్ ఎన్ఎల్, ప్రీ లిటికేషన్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులతో పాటు పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

4న మోటారుసైకిళ్ల వేలం

కొవ్వూరు: వివిధ కేసుల్లో పట్టుకున్న మూడు మోటారుసైకిళ్లను వచ్చే నెల తేదీన పట్టణంలో తమ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆరోజు ఉదయం పది గంటలకు నిర్వహించే ఈ వేలంలో ఆసక్తి ఉన్న వారు రూ.5వేల ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చునని సూచించారు. తమతోపాటు ఆధార్ కార్డు జిరాక్సులు తెచ్చుకోవాలని తెలిపారు. వేలంలో వాహనాన్ని దక్కించుకున్న పాటదారులు సొమ్ము మొత్తంతోపాటు 18 శాతం జీఎస్టీ కలిపి వెంటనే చెల్లించాలని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 944090 2340 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

శాంతి సమాజమే సంస్థ లక్ష్యం

- మానవత సంస్థ జిల్లా అధ్యక్షుడు మోహనరావు
- సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మండల మానవత నూతన కార్యవర్గం

తాళ్లపూడి: శాంతి సమాజమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు చేయాలని మానవత సంస్థ జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు అన్నారు. తాళ్లపూడిలోని సాల సదమయంతి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం మండల మానవత స్వచ్ఛంద సంస్థ 2024–2025 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. మండల మానవత అధ్యక్షుడిగా అంకెం సురేష్, ఉపాధ్యక్షుడిగా తగిరిపల్లి దోసయ్య, కార్యదర్శిగా సనపల రాజశేఖర్, కోశాధికారిగా ఎ.హనుమంతరావు, జాయింట్ సెక్రటరీగా పెమ్మాడి దుర్గాప్రసాద్, ఈసీ ఎడ్యుకేషన్ ఎం.విజయలక్ష్మి, ఈసీ ఎమర్జెన్సీ ఇంజరపు సత్యనారాయణ, ఈసీ అవేర్‌నెస్ మాధవరపు రామాదేవి, ఈసీ హెల్త్ కె.వెంకటేశ్వరరావు తదితరులను ఎన్నుకున్నారు. వీరితో మోహనరావు ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందు గత సంవత్సరం చేపట్టిన సేవా వివరాలను తెలియజేశారు. జిల్లా అధ్యక్షుడు మోహనరావు మాట్లాడుతూ 108 మందితో ప్రారంభమైన సంస్థ నేడు 11 జిల్లా ల్లో 109 మండలాల్లో 65 వేలకు మంది వరకు సభ్యులున్నారని తెలిపారు. సేవ చేయాలి అనే ఆలోచన ఉన్నవారితో సంస్థ నడుస్తుందన్నారు. ఈ సందర్భంగా సంస్థకు దాతలు అందజేస్తున్న సాయాన్ని అభినందించారు. అనంతరం నూతన కమిటీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ మండల గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్ధనరావు, రీజనల్ చైర్మన్ వి చంద్రయ్య, మానవత సభ్యులు గెద్దం సాయిబాబా, సీహెచ్ ఆంజనేయులు, అప్పన చంద్ర గుప్త, దుగర్గిరాల సూర్యనారాయణ, గోకవరపు బాబు, సాయన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



మానవత అధ్యక్షుడుకి బాధ్యతలు అప్పగిస్తున్న జిలా అధ్యక్షుడు మోహనరావు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చాగల్లు: ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.నిశిత అన్నారు. శుక్రవారం డయేరియా, సీజనల్ వ్యాధులపై పీహెచ్‌సీ పరిధిలోని ఏఎన్ఎంలకు, పంచాయితీ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో స్టాప్ డయేరియా కార్యక్రమం జూలై ఒకటి నుంచి ఆగస్టు 31 వరకు, 2 నెలలు పాటు జరుగుతుందని తెలిపారు. డయేరియా (అతిసారా) వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండడం, గ్రామ స్థాయిలో పారిశుధ్యం మెరుగుగా ఉండాలని, నీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకు తప్పని సరిగా శుభ్రం చేయాలని, క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే ప్రజలకు పంపిణీ చేయాలని సూచించారు. మురుగు కాలవలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూడాలని, గ్రామంలో ఉన్న ప్రతి 0–5 సంవత్సరాల లోపు పిల్లలకు ఓఆర్ఎస్ పాకెట్స్ ఇవ్వాలని, ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగేలా అవగాహన కల్పించాలన్నారు. జ్వరం, విరోచనాలు అయిన వారిని వెంటనే గుర్తించి, తగు చికిత్స అందించాలని సూచించారు. గ్రామ పరిధిలో ఉన్న హెచ్‌డబ్ల్యూసీ (హెల్త్ క్లినిక్స్) ద్వారా పీహెచ్‌సీకి పంపించాలని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు పీఆర్ఎల్ దేవి, పీహెచ్ఎన్ వి.పద్మ, ఎంపీహెచ్ఈవో సీహెచ్ శ్రీనివాస్, ఎంపీహెచ్ఏస్‌లు ఎ.రామచంద్రరావు, ఎస్.సారమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.రాజశేఖర్, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



కొవ్వూరులో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, న్యాయవాదులు

కొవ్వూరు: కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సుర సంహిత, భారతీయ సాక్ష్యా అధికనియం చట్టాలను నిలుపుదల చేయాలని కోరుతూ కొవ్వూరులో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఏఐఎల్‌యూ) ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. కోర్టు ప్రాంగణంలో ప్లకార్డులు, ఫ్లెక్సీ బ్యానర్‌తో నినాదాలు చేశారు. కొవ్వూరు శాఖ ఉపాధ్యక్షుడు వల్లభిశెట్టి సురేష్, సెక్రటరీ పీవీపీ లక్ష్మి, వై.ప్రభాకరరావు, టి.ప్రభాకరరావు, డీజీ ముల్లార్, టి.తారాకుమారి, ఎం.శ్రీవల్లి, టీఆర్ చారి తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి వారాహి దేవి గుప్త నవరాత్రులు

సీటీఆర్ఐ: ఆషాఢ మాసంలో వారాహి దేవి గుప్త నవరాత్రులు పురస్కరించుకుని గాడాల మహాలక్ష్మి సమేత చిన్నవేంకటేశ్వరస్వామి పీఠంలో జూలై 4న నుంచి 18వ తేదీ వరకు అమ్మవారు వారాహి దేవిగా భక్తులకు దర్శనమిస్తారని పీఠాధిపతి డాక్టర్ చిన్నవేంకన్నబాబు స్వామీజీ అన్నారు. ఈ మేరకు పోస్టర్‌ను స్థానిక తిలక్ రోడ్డులో శుక్రవారం ఆయనతో పాటు, ముదునూరి వేంకటలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి తెల్లవారుజామున అర్చనలు జరుగుతాయన్నారు.

సీఐకు అభినందనలు



ఎస్పీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ జగదీశ్వరరావు

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికలు సక్రమంగా ప్రశాంతంగా నిర్వహించినందుకు కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావుని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభినందించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని సమర్థవంతంగా పనిచేసేందుకు గాను ప్రశంసాపత్రం తోపాటు నగదు పారితోషికాన్ని అందజేశారు. రాజమహేంద్రవరం లో జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల నిరసన



పట్టణంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, ముస్లింలు

నిడదవోలు: దేశవ్యాప్తంగా ముస్లింలపై దాడులు, ద్వేషపూరిత ప్రసంగాలను ఖండిస్తూ సీపీఎం పొలిట్ బ్యూరో పిలుపుమేరకు స్థానిక చినమసీదు వద్ద రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ లోకసభ ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి దేశంలో పలు ప్రాంతాల్లో ముస్లింలపై పెద్దఎత్తున దాడులు పెరిగాయని విమర్శించారు. చత్తీస్‌ఘడ్ రాజధాని రాయపూర్‌లో ఎద్దులను రవాణా చేస్తున్న ముగ్గురు ముస్లింయువకులను ఆవుల స్మగ్లర్లుగా ముద్ర వేసి హతమార్చారని విమర్శించారు. కేంద్రంలో బీజేపీకి సీట్లు తగ్గడంతో ఎదురు దెబ్బతో మతోన్మాదుల దాడులు పెరిగాయని రాంబాబు విమర్శించారు. ఈ మతోన్మాద శక్తుల కుతంత్రాలపై అత్యంత అప్రమత్తంగా ఉండాలని సీపీఎం విజ్ఞప్తి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖయ్యూమ్, జానీ, ఉస్మాన్, మజీద్ అజార్, షరీఫ్, శ్రీనివాసరావు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మా చిన్ని స్టార్స్ సందడి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం తుమ్మలావ ఎంపీఎల్ ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం 'మా చిన్ని స్టార్స్' విద్యార్థులతో కలిసి సందడి చేశారు. జూలై ఒకటి నుంచి స్టార్‌మాలో ప్రసారం కానున్న కొత్త టీవీషో 'చిన్ని'లోని పాత్రలైన చిన్ని, కావేరితో కలిసి విద్యార్థులు ఆడిపాడారు. ఆకర్షణీయమైన గేమ్‌లతో చిన్ని యువ ప్రేక్షకులను ఆకర్షించింది. తల్లీబిడ్డ అనే అంశంపై పెయింటింగ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఆక్స్‌ఫర్డ్ బుక్‌లను అందించారు. విద్యార్థులకు చిన్ని, కావేరీ స్కూలు బ్యాగ్‌లను పంపిణీ చేశారు.

లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు



మధ్యాహ్న భోజన కార్మికులకు చీరలు అందజేస్తున్న లయన్స్ మండల అధ్యక్షుడు

తాళ్లపూడి: మలకపల్లిలోని పంక్షన్ హాల్‌లో శుక్రవారం మండల లయన్స్ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లపూడి మండల లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుంటముక్కల వీరభద్రరావు, సెక్రటరీగా సున్న సోమశేఖర్‌బాబు, కోశాధికారిగా ఎల్లిన బ్రహ్మానందం ఇతర సభ్యులతో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ పూర్వపు జిల్లా గవర్నర్ కొత్తపల్లి రవికుమార్ నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం పలువురు మధ్యాహ్న భోజన పథకం సిబ్బందికి చీరల పంపిణీ చేశారు. రోగులకి ఆర్థిక సహాయం అందజేశారు. డయాలసిస్ పేషెంట్ ఒకరికి జొన్నలగడ్డ రూ.20 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల లయన్స్ క్లబ్ ఫౌండర్, డిస్ట్రిక్ట్ కమిటీ మెంబెర్ జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, సభ్యులు జీవి, నామన పరమేశ్వరరావు, కోటారు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్

ఉండ్రాజవరం: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఉండ్రాజవరంలో శ్రీసుధీంద్రబాబు ధార్మిక ట్రస్ట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో వ్యవసాయం, ఇరిగేషన్, రోడ్లు, భవనాలు, పంచాయతీ రాజ్, సంక్షేమ పథకాలు, వివిధ రకాల పింఛన్లు అమలు తీరుపై మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు అందించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. ధాన్యం బకాయిలు త్వరలో రైతులకు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. డ్రాప్ అవుట్స్ లేకుండా ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యాశాఖ పని చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యా కిట్లను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, తహసీల్దార్ కె.నవీన్‌కుమార్, ఎంపీడీవో కె.నరేంద్ర రెడ్డి, ఈవోపీఆర్డీ జె.ప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.శ్రీనివాస రావు, అధికారులు పాల్గొన్నారు.



దుర్గేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన శ్రేణులు

మంత్రి దుర్గేష్ దృష్టికి రహదారుల సమస్యలు

దేవరపల్లి: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను గోపాలపురం నియోజకవర్గం జనసేన శ్రేణులు శుక్రవారం కలిశారు. ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డి.సువర్ణరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ మండల అధ్యక్షుడు, జిల్లా నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను మంత్రి దుర్గేష్ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించాలని కోరినట్టు సువర్ణరాజు స్థానిక విలేకరులకు తెలిపారు. ప్రధానంగా దేవరపల్లి–లక్ష్మీపురం రోడ్డులో పోలవరం కుడి కాలువపై అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణం గురించి తెలియజేసినట్టు తెలిపారు. నిడదవోలు– పొంగుటూరు రోడ్డు త్యాజంపూడి నుంచి యాదవోలు వరకు అధ్వనంగా ఉందని, గోపాలపురం–దొండపూడి రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయని, పోలవరం కుడి కాలువపై దేవరపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న వంతెన పూర్తికాలేదని చెప్పినట్టు ఆయన తెలిపారు. ఈ సమస్యలపై మంత్రి దుర్గేష్ స్పందిస్తూ తన వంతు సహకారం అందిస్తానని చెప్పారని సువర్ణరాజు తెలిపారు తెలిపారు. నాలుగు మండలాల అధ్యక్షులు కాట్నం గణేష్, రాజేంద్ర, పోసిన గణపతి, టి. బాపిరాజు, తడగల శ్రీను, జుత్తిగ శ్రీనివాస్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

సమన్వయంతో అభివృద్ధిని సాధిద్దాం

మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే వెంకట్రాజు



ఎమ్మెల్యే వెంకట్రాజును సత్కరిస్తున్న ఎంపీపీ బంక జయలక్ష్మి, జెడ్పీటీసీ ముప్పిడిలక్ష్మి

నల్లజర్ల: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శుక్రవారం జరిగిన నల్లజర్ల మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల పరిషత్ తరఫున ఎంపీపీ బంక జయలక్ష్మి, జెడ్పీటీసీ ముప్పిడిలక్ష్మి ఎమ్మెల్యేను సత్కరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పుష్పగుచ్ఛాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల లక్ష్యం ఒక్కటే కావాలన్నారు. ప్రజలకు మంచిచేయాలన్నారు. నాయకత్వం అనేది దిశా, నిర్దేశం చేసి వ్యవస్థను నడిపించాలన్నారు. రాజకీయమనేది నెగిటివ్ షేడ్‌లో చూడకుండా రాజకీయమనేది పవిత్రమైన దృక్పథంతో సంకల్పంతో చేసే దాశగా తాను నమ్ముతానన్నారు. అధికారులుకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నరేష్ కుమార్, తహసీల్దారు కృష్ణారావు, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.